60 కిలోల గంజాయి స్వాధీనం 7లో
రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో 'రాత'కు ప్రథమ స్థానం 7లో
12 అడుగుల కొండ చిలువ హతం

'భజన'కే ఖజానా!



- దేవుడికి 'నామాలు' పెట్టేశారు
- అన్నవరం దేవస్థానంతో గత వైసీపీ సర్కారు అడ్డగోలుగా ఆటలు
- అడుగడుగునా అనాలోచిత నిర్ణయాలతో సత్యదేవుడి ఖజానాకు అధికారుల కన్నం
- దేవదాయశాఖ మంత్రి మెప్పుకోసం రూ.4కోట్లతో హైవేపై నమూనా ఆలయం
- తీరా నిర్మించిన తర్వాత భక్తుల రద్దీయే లేదు: రోజూ టెంకాయికొట్టి నివేదనతో సరి
- నమూనా ఆలయం నిర్మించేముందు కనీసం భక్తుల కోణంలో ఆలోచించని అధికారులు
- అటు ఏడాదికోసారి చేపట్టే రథోత్సవంలో పెద్దరథం తయారీకి ఏకంగా రూ.1.30కోట్లు
- రథం భారీ, రహదారులు ఇరుకైనవి కావడంతో కష్టతరంగా రథోత్సవం
- పాతది ఉన్నా పక్కనపడేసి రూ.60లక్షలతో దేవుడి నామాల బోర్డు ఏర్పాటు
- జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం పేరుతో రూ.20లక్షలతో భవనం ఆధునికీకరించి ఆనక మూలకు
- వనదుర్గ మార్గ్ పేరుతో రూ.40 లక్షల వృథా చేసి కొండను గుల్ల చేసిన వైనం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/అన్నవరం:

దేవుడి ఆలయానికి వచ్చే ప్రతి రూపాయిని ఎంతో పొదుపుగా, బాధ్యతగా ఖర్చుపెట్టడం ఆలయ అధికారుల విధి. వెచ్చించే ప్రతి పైసా ఆలయ ప్రతిష్ఠను పెంచడంతోపాటు భక్తులకు మేలు చేసేదిగా ఉండాలి. కానీ గత వైసీపీ పాలనలో అన్నవరం ఆలయ ప్రతిష్ఠను అధికారులు నిలువునా ముంచేశారు. లేనిపోని ప్రచారార్భాటాలకు పోయి దేవుడి కంటే దేవదాయశాఖ మంత్రినే ప్రసన్నం చేసుకునేందుకు పోటీపడ్డారు. అందుకోసం సత్యదేవుడి సొమ్మును లెక్క లేనట్లు ఖర్చుపెట్టేశారు. అవసరం లేకున్నా అనవసర ఖర్చులతో అధికార పెద్దల దృష్టిలో పడేందుకు ఇష్టానుసారం వ్యవహరించారు. బాధ్యత మరిచి భజనకే పెద్దపీట వేశారు. ఫలితంగా అనవసర ఖర్చులు, అర్థంలేని నిర్ణయాలతో దేవుడి ఖజానాను గుల్లచేసేశారు. ఆలయానికి సమీపంలో హైవేపై నమూనా ఆలయ నిర్మాణం మొదలు, పెద్ద రథం తయారీ, వనదుర్గ మార్గ్, సత్యదేవ వ్రతం పేరుతో భవనాలను సిద్ధం చేయడం వరకు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి దేవుడి సొమ్ములు వృథా చేసేశారు. ఆలయానికి, భక్తులకు ఏదైనా ప్రయోజనం ఉందంటే అదీ లేదు.

లెక్క లేకుండా వ్యవహరించారు..

అన్నవరం దేవస్థానంలో సత్యదేవుడి పేరుతో గత వైసీపీ పాలనలో అధికారులు చేసిన అనవసర ఖర్చు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆలయానికి పెద్దగా అక్కర్లేని పనులతో ఖజానాకు గండికొట్టిన తీరు తీవ్ర విమర్శలపాలు చేస్తోంది. ఎవరికివారు ఆలయ ఉన్నతాధికారులు దేవుడి దర్శనం కోసం వచ్చే భక్తులకు మరింత సదుపాయాలు ఎలా కల్పించాలో ఆలోచించాల్సిందిపోయి దేవదాయశాఖ మంత్రి, ఇతర అధికార పార్టీ పెద్దలను ఎలా ప్రసన్నం చేసుకోవాలి? వారు చెప్పిన ప్రతిదానికీ తలూపి దేవుడి డబ్బును ఎలా గుల్ల చేయాలి అనేదానికే ప్రాధాన్యం ఇవ్వడం ఆక్షేపణలకు దారితీస్తోంది. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వంలో దేవదాయశాఖ మంత్రిగా పనిచేసిన కొట్టు సత్యనారాయణ ఆదేశాలు, ఆయనకు అధికారులు ఇచ్చిన అర్థంపర్థం లేని సూచనలతో ఎలాంటి ముందుచూపు లేకుండా దేవస్థానం నిధులను ఇష్టారాజ్యంగా అవసరానికి మించి ఖర్చుచేసేశారు. ముఖ్యంగా అప్పట్లో నమూనా ఆలయం పేరుతో తీసుకున్న నిర్ణయం దేవుడి డబ్బును ఎంతలా వృథా చేశారనేది చాటుతోంది. వాస్తవానికి అన్నవరం దేవస్థానం హైవేకు అతిసమీపంగా ఉంది. ఇక్కడకు వచ్చే భక్తులు కొండపైకి వెళ్లి దర్శనం చేసుకుని వస్తారు. కానీ హైవేపై వెళ్లే జనం కొండపైకి రానక్కర్లేకుండా హైవేపై నమూనా ఆలయం నిర్మించాలని అప్పట్లో మంత్రి కొట్టు ఆదేశించారు. తద్వారా ఈ నమూనా ఆలయాన్ని దర్శించుకుని భక్తులు సులువుగా వెళ్లిపోవచ్చని అర్థంపర్థం లేని విచిత్ర నిర్ణయం తీసుకున్నారు. ఇంకేముంది మంత్రి చెప్పిందే తడవుగా అధికారులు నిలువుగా తలూపారు. సాధ్యాసాధ్యాలు, అవసరాలతో సంబంధం లేకుండా నమూనా ఆలయం నిర్మించాలని నిర్ణయించి ఇందుకు రూ.4కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించేశారు. వాస్తవానికి హైవేపై వెళ్లే భక్తుల కోసం రెండు దశాబ్దాలుగా నమూనాలయం కూడా ఉంది. కానీ రాజమహేంద్రవరంవైపు వెళ్లే భక్తుల కోసం ఇంకో గుడి కట్టాలని మంత్రి ఆదేశించేసరికి గుడ్డిగా రూ.4కోట్లతో గుడి నిర్మించేశారు. వాస్తవానికి అధికారులు మంత్రి ఆదేశాలకు ప్రాధాన్యం ఇచ్చినా తొలుత రూ.కోటితో కొత్తగా నమూనా ఆలయం నిర్మించి ఆ తర్వాత భక్తుల రద్దీని బట్టి దశలవారీగా అభివృద్ధి చేసి ఉండాల్సింది. కానీ ఇదేదీ పట్టించుకోలేదు. ఇక్కడ నిర్మించిన కొత్త నమూనా ఆలయంవద్ద జాతీయ రహదారిపై భారీ వాహనాలు నిలపడానికి కనీసం స్థలం కూడా పెద్దగా లేదు. అయినా ఇదేదీ పట్టించుకోకుండా అధికారులు నమూనా ఆలయాన్ని నిర్మించేశారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చిన సమయానికి ఈ ఆలయ పనులు అసలు పూర్తికాలేదు. కానీ శిలాఫలకంపై పేరు కోసం అప్పటి మంత్రి కొట్టు సత్యనారాయణ ఆఘమేఘాలపై దీన్ని ప్రారంభించేశారు. ప్రస్తుతం కొత్త నమూనా ఆలయం వద్ద పరిస్థితి చూస్తే రూ.4కోట్లు ఎందుకూ కొరగాకుండా పోయినట్లయింది. రోజూ ఉదయాన్నే ఓ అర్చకుడు ఇక్కడకు వచ్చి టెంకాయి కొట్టి నివేదన చేసి వెళ్లిపోతున్నాడు. ఇది మినహా భక్తులెవరూ ఇక్కడకు రావడం లేదు. ప్రస్తుతం ఆషాఢమాసం కావడంతో ఉభయగోదావరి జిల్లాలకు చెందిన భక్తులు తలుపులమ్మలోవ దర్శనానికి వెళ్లి తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లే సమయంలో కనీసం ఇక్కడ ఆగడం లేదు. కేవలం ఆది, మంగళ, గురువారాల్లో మాత్రమే అతి తక్కువమంది ఇక్కడకు ప్రసాదాలకోసం వస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి గుడ్డి ఆదేశాలు, ఆయనవద్ద ప్రాపకం కోసం అధికారులు రూ.4కోట్లు వ్యయం చేసిన తీరు దేవుడి ఖజానాను అధికారులు గుల్ల చేసిన వైనాన్ని కళ్లకు కడుతోంది.



ముందుచూపు లేకుండా నిర్మించిన నమూనా ఆలయం

'నామాలు' పెట్టేశారు..

అన్నవరం దేవస్థానం చరిత్రలో గతంలో ఎప్పుడూ రథోత్సవం లేదు. కానీ అధికారులు కొత్తగా దీన్ని ప్రవేశపెట్టారు. సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా అయిదోరోజు ఈ రథోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం కొత్తగా రూ.1.30కోట్లతో భారీ టేకు రథాన్ని తయారుచేయించారు. వాస్తవానికి ఈ రథాన్ని ఏడాదిలో ఒక్కసారి మాత్రమే వినియోగిస్తారు. కానీ దీనికి అత్యంత భారీగా ఖర్చుచేశారు. వాస్తవానికి ఇంతపెద్ద భారీ రథం చేయించడంతో దీని నిర్వహణ ఇప్పుడు కత్తిమీదసాములా మారింది. అత్యంత ఎత్తుగా ఈ రథం ఉండడంతో రథోత్సవం నిర్వహించినంతసేపు వైర్లు తెగిపోతాయనే భయంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితి. రహదారులేమో చిన్నవి కావడంతో దీన్ని తీసుకువెళ్లడం సమస్యగా మారింది. వాస్తవానికి చిన్న రథం తయారు చేయించాల్సి ఉండగా, అధికారులు మాత్రం ఇదేదీ ఆలోచించలేదు. దీంతో ఇప్పుడు ఏడాదిలో ఒక్క రోజు మినహా మిగిలిన అన్నిరోజులు దీన్ని ఎక్కడ నిలిపి ఉంచాలో కూడా తెలియని పరిస్థితి. చివరకు ఎక్కడా సరైన ప్రదేశం లేక పంపా యాత్రికుల వసతి సముదాయంవద్ద షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. పైగా ఇంత పెద్ద రథాన్ని తయారు చేయించాక సదరు మంత్రి మెప్పుకోసం గొప్ప పని చేసినట్లు అధికారులు కలరింగ్ ఇచ్చుకున్నారు. ఇదంతా ఒకెత్తయితే కొండపై రూ.60లక్షల వ్యయంతో సత్యనారాయణస్వామి నామాలు కనిపించేలా కొత్తగా లైటింగ్ ఏర్పాటు చేశారు. వాస్తవానికి ఈ నామాల లైటింగ్ బోర్డు గతంలో ఉండేది. మరమ్మతుకు గురైందనే సాకుతో పక్కనపడేశారు. దీన్ని తక్కువ వ్యయంతో తిరిగి మరమ్మతు చేస్తే సరిపోయేదానికి దేవుడి ఖజానాను గుల్ల చేసేశారు. రూ.10వేల టికెట్ ధరతో కొండపై జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం ప్రారంభించాలని భావించారు. ఇందుకోసం వ్రత భవనం లేకపోవడంతో రూ.20లక్షల వ్యయంతో దేవస్థానం అకౌంట్ విభాగ కార్యాలయాన్ని ఆధునికీకరించారు. తీరా పనులు పూర్తయ్యాక కాలక్రమంలో భక్తులకు ఈ వ్రతం ఆర్థికభారమని భావించి నిలిపివేశారు. ఫలితంగా రూ.20లక్షలు వృథా అయినట్లయింది. కొండపైకి వెళ్లే దారిని వనదుర్గ మార్గ్ అని మా ర్చడం కోసం ఎక్స్‌కవేటర్‌లతో ముందస్తు ఆలోచన లేకుండా అక్కడ ఉన్న నిర్మాణాలు దెబ్బతినేలా కొండను గుల్లచేశారు. దీనికి రూ.30లక్షలు అనవసరంగా ఖర్చుచేశారు. తీరాఇది ప్రమాదకరం అని భావించి వనదుర్గ మార్గ్‌ను మూసివేశారు. సత్యదేవుడి ఖజానాకు వైసీపీ పాలనలో అధికారులు ఇష్టానుసారం గండికొట్టేశారు. బాధ్యతారాహిత్యంగా పనిచేసి పాపం మూటగట్టుకున్నారు.

గ్రీవెన్స్‌కు పోటెత్తిన అర్జీదారులు



కలెక్టరేట్‌లో వినతులు సమర్పించేందుకు భారీగా హాజరైన అర్జీదారులు

- కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు భారీగా వచ్చిన ప్రజలు
- వివిధ సమస్యలపై 470 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 15: కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అర్జీదారులు పోటెత్తారు. జిల్లావ్యాప్తంగా వివిధ మండలాలనుంచి వచ్చిన అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిటలాడింది. ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, సీపీవో త్రినాథ్, జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ, డీపీవో భారతి సౌజన్య, కాకినాడ ఆర్డీవో కిషోర్, డీఎల్డీవో నారాయణమూర్తి ఆధ్వర్యంలో వినతులను స్వీకరించారు. మొత్తంగా 470అర్జీలను స్వీకరించారు. దీనిలో పింఛన్లు, ఆరోగ్యశ్రీ, ఇంటి స్థలాలు, ఆన్‌లైన్‌లో భూమి నమోదు వంటి అంశాలపై ఉన్నాయి. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అందిన వినతులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి తీసుకున్న చర్యలను అప్డేట్ చేయాలని ఆదేశించారు.

భూమిని సర్వే చేయాలి

-గంగాధర్, దుర్గాడ గ్రామం, గొల్లప్రోలు మండలం

నా అధీనంలో ఉన్న భూమిని సర్వే చేసి ఆన్‌లైన్‌కు జత చేయాలి. నాకు 50సెంట్ల భూమి ఉండగా గతంలో చేసిన సర్వేలో 35సెంట్లు నమోదు చేసి పాసు పుస్తకం ఇచ్చారు. ఈ తప్పును సరిదిద్దాలి.

ఆక్రమణలను తొలగించాలన్నా పట్టించుకోలేదు

-త్రిమూర్తనరావు, కోటనందూరు

మా గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే పుంతరోడ్డును ఆక్రమించారని గతంలో ఫిర్యాదు చేయగా ఆ ఆక్రమణలను తొలగించాలని అధికారులు ఆదేశించినా గ్రామంలో తొలగించడం లేదు. దీనిపై చర్యలు తీసుకోవాలి. ఈ ఆక్రమణలో వైసీపీ నాయకుల హస్తం ఉంది.

జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించలేదు

-ఆళ్ల రత్నం, కాకినాడ రూరల్

జగనన్నకాలనీలో ఇళ్లు నిర్మిస్తామని రూ.35వేలు సొమ్ము కట్టించుకున్నారు. ఇప్పటి వరకు పునాది నిర్మించలేదు. అధికారులను సంప్రదిస్తే కాంట్రాక్టర్‌ను మార్చామని త్వరలో నిర్మిస్తామని బదులిచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తికాలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

వివిధ నేరాల్లో చోరీ సొత్తు స్వాధీనం

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్ కుమార్

కాకినాడ క్రైం, జూలై 15: వేర్వేరు ప్రాంతాల్లో వివిధ నేరాలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి వారినుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ సుబ్రమణిసతీష్‌కుమార్ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

బంగారం చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

కాకినాడ రాజాజీవీధిలో సుధీర్‌కుమార్‌చౌహాన్ బంగారు దుకాణం నడుపుతున్నాడు. అతడు వేర్వేరు ప్రాంతాల్లో బంగారు ఆభరణాలను తయారు చేయించి తన దుకాణంలో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో రంగనాథం అనే వ్యక్తి బంగారు వస్తువులతో కోయంబత్తూర్ నుంచి వచ్చాడు. ఆ వస్తువులు చౌహాన్‌కు నచ్చకపోవడంతో వాటిని రంగనాథానికి ఇచ్చి తిరిగి పంపేందుకు కాకినాడ జీజీహెచ్‌వద్ద ఉన్న బస్టాప్‌కు తీసుకువచ్చాడు. ఈ నేపథ్యంలో చౌహాన్ దగ్గర ఉన్న బ్యాగ్‌ను కత్తిరించి అందులోఉన్న రూ.4లక్షల విలువ చేసే 133 గ్రాముల బంగారు ఆభరణాలను అగంతకులు దోచుకుపోయారు. దీనిపై చౌహాన్ అదేరోజు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం కాకినాడ దేవాలయం వీధిలోని సహకార బ్యాంక్‌వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిది విశాఖపట్నం అని, వారి పేర్లు అరటికట్ల తారకేశ్వర్‌రావు, కరణం సత్తిబాబులుగా పోలీసులకు వివరించారు. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4లక్షల విలువైన 133 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగదు దోపిడీ కేసులో ఒకరి అరెస్టు

ఈనెల 13న కాకినాడకు చెందిన చిట్టిబోయిన ఉమామహేశ్వరరావు కుంభాభిషేకం రేవువద్ద చేపలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా ఒక వ్యక్తి తన బైక్‌తో అడ్డగించి బెదిరించి ఉమామహేశ్వరరావు వద్దఉన్న రూ.30వేల నగదును లాక్కుని ఉడాయించాడు. దీంతో బాధితుడు పోర్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు తిరుపతికి చెందిన వాయిల వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడినుంచి రూ.30వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వర్లు బండిలో తెల్లకోటు, స్టెతస్కోప్ ఉండడంతో ఆ కోణంలో విచారించారు. ఈ విచారణలో వెంకటేశ్వర్లు తాను చాలాచోట్ల ప్రభుత్వ ఉద్యోగినని డాక్టర్‌గా పనిచేస్తానని అనేక మోసాలకు పాల్పడ్డాడన్నారు. అతడిని ఆర్గనైజ్డ్ క్రిమినల్‌గా గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

కార్లు తాకట్టు కేసులో ఇద్దరు అరెస్టు

గతనెల 17న కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి వద్దకు స్థానిక రేచర్లపేటకు చెందిన తెలుగు రాజేష్, కాకినాడ రూరల్ మండలం వలసపాకలకు చెందిన బక్కి కిషోర్ అనే వ్యక్తులు వచ్చి రూ.2వేలు అద్దె చెల్లించేలా రెండు కార్లు అద్దెకు కావాలని అడిగి కార్లు తీసుకువెళ్లారు. అద్దె సక్రమంగా చెల్లించకుండా కాలయాపన చేయడంతో వెంకటేశ్వరరావు కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం పోలీసులు విచారణ చేయగా ఇద్దరు కలిసి రెండు కార్లను తాకట్టు పెట్టినట్టు తెలిసింది. దీంతో రాజేష్, కిషోర్‌లను అదుపులోకి తీసుకుని విచారించి ఇదే తరహాలో నేరాలకు పాల్పడిన ఏడు కార్లను వారినుంచి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ఎంవీజే భాస్కరరావు, కాకినాడ ఎస్‌డీపీవో డాక్టర్ కె.హనుమంతురావు, పోర్ట్ సీఐ సుమంత్, వన్‌టౌన్ సీఐ వి.సురేష్‌బాబు, ఎస్‌ఐలు చిన్నబాబు, పుల్లయ్య పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను సత్కరించిన డిప్యూటీ సీఎం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 15: జనసేన పార్టీ తరఫున కాకినాడ ఎంపీగా గెలిచిన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలను మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సోమవారం ఘనంగా సత్కరించారు.



కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దరఖాస్తుల గడువు పొడిగింపు

కాకినాడ రూరల్, జూలై 15: కాకినాడజిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో అనగా ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, ఎయిడెడ్, పురపాలక ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 18వరకూ పొడిగించినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు.అర్హతగల ఉపాధ్యాయులు http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రహణం మొర్రి ఉందని తుప్పల్లో పడేశారు! 7లో

- ఒంటిమామిడి గ్రామంలో తుప్పల్లో ఆడ శిశువు

'ఎస్పీ సతీష్‌కుమార్ సేవలు అభినందనీయం'

కాకినాడ క్రైం, జూలై 15: ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ జిల్లాకు అందించిన సేవలు అభినందనీయమని అడిషనల్ ఎస్పీలు భాస్కరరావు, శ్రీలక్ష్మి, సత్యనారాయణ కొనియాడారు. బదిలీపై గుంటూరు వెళ్తున్న సతీష్‌కుమార్‌ను సాయుధదళాలు కవాతు నిర్వహించి సాయుధ వందనం చేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వర్తించినంత కాలం సతీష్‌కుమార్ వివాదరహితుడిగా మంచి పరిపాలన అందించారన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్‌డీపీవో డాక్టర్ కె.హనుమంతురావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, వన్‌టౌన్ సీఐ వి.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉన్నతాధికారులు

మన్యంవారిపాలెంలో జగనన్న లే అవుట్ దున్నివేత

జగ్గంపేట రూరల్, జూలై 15: జగ్గంపేట మండలంలోని మన్యవారిపాలెం గ్రామంలో జగనన్న లే అవుట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దున్నేశారు. మన్యవారిపాలెం గ్రామస్తులకు సర్వే నెంబరు 21లో ఐదెకరాలు 25సెంట్ల భూమిని ఇళ్లస్థలాలకు కేటాయించారు. ఈ లేఅవుట్‌లో ఇప్పటివరకు 193మందికి ఇళ్లస్థలాలు మంజూరు చేశారు. వీరందరికీ రిజిస్ట్రేషన్ చేసి హక్కును కల్పిస్తూ పట్టా ఇచ్చారు. ఈ భూమిపై గతంలో అనేకసార్లు ఆందోళనలు జరిగాయి. ఎప్పటినుంచో ఈ భూమి తమ స్వాధీనంలో ఉందని గ్రామానికి చెందిన కొంతమంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. తమ తాతల దగ్గరనుంచి ఈ భూమి తమ స్వాధీనంలో ఉందని, తాము సాగు చేసుకుంటూ దీనిమీద పోషకరణ చేసుకుంటున్నామని అధికారులకు విన్నవించారు. ఇది ప్రభుత్వ భూమి అని అధికారులు వారికి బదులు ఇఇచ్చారు. ఇప్పుడు ఎవరో దుక్కుదున్నేయడంతో గ్రామస్తుల్లో సందిగ్ధం నెలకొంది. గ్రామంలో ఇచ్చిన పట్టాలన్నీ పరిస్థితి ఏంటనేది తెలియాల్సి ఉంది.



దున్నేసిన జగనన్న లే అవుట్

దొంగ సంతకాలు, ఫేక్ పట్టాలతో స్థలాలు అమ్మేశారు

- పిఠాపురం మున్సిపాల్టీ అధికారులకు టీడీపీ కౌన్సిలర్ల ఫిర్యాదు

పిఠాపురం,జూలై 15: దొంగ సంతకాలతో ఫేక్ పట్టాలు సృష్టించి ఖాళీ స్థలాలు కొందరు అమ్మేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీడీపీ కౌన్సిలర్లు సోమవారం పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు, తహసీల్దారు లక్ష్మీలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కబ్జాకు గురైన ఖాళీ స్థలాల్లో భవనాల నిర్మాణం చేపట్టారని చెప్పారు. పిఠాపురం పట్టణంలో పురపాలక సంఘానికి చెందిన స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు కోవాలని, మునిసిపల్ ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతులు అందజేసిన వారిలో మునిసిపల్ టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నల్లా శ్రీనివాస్, కౌన్సిలర్ రాయుడు శ్రీనుబాబు పాల్గొన్నారు.



కమిషనరుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

భీమేశ్వరునికి ఇక జలాభిషేకమే!



సూచనలిస్తున్న అధికారులు

పంచామృతాలు, పండ్ల రసాలు వద్దు

పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్ట్ ఉత్తర్వులు

పూర్తి అయిన మూలవిరాట్ సంరక్షణ పనులు

ద్రాక్షారామ, జూలై 15 :ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి జలాలతోనే అభిషేకాలు నిర్వహించాలని కేంద్ర పురావస్తుశాఖ సైన్స్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. పాలు, పెరుగు, తేనె, గంధం, కొబ్బరినీరు, గంధం, పండ్ల రసాలు వంటి ద్రవ్యాలతో శివలింగానికి అభిషేకాలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఇటీవల చేపట్టిన మూలవిరాట్ సంరక్షణ పనులు కేంద్ర పురావస్తుశాఖ పూర్తి చేసింది. మూలవిరాట్ సంరక్షణకు కొన్ని సంరక్షణ చర్యలు అమలు చేయాలని కేంద్ర పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



కల్తీ ద్రవ పదార్థాలతో నష్టం

స్వామివారి అభిషేకానికి గత రెండు దశాబ్దాల కాలంగా ప్యాకెట్ పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పండ్ల రసాలు ఇతర ద్రవ్యాల వినియోగం పెరిగిపోయింది. పరిమితి లేకుండా ద్రవ పదార్థాలు వినియోగిస్తున్నారు. ద్రవ పదార్థాల్లో ఉన్న యాసిడ్ ఇతర రసాయనాలతో మూల విరాట్ రూపం దెబ్బతింది. దీంతో గతంలో 2011లో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఆలయంలో మూలవిరాట్ సంరక్షణ పనులు నిర్వహించారు. అప్పట్లో కూడా పలు సంరక్షణ చర్యలు పురావస్తుశాఖ అధికారులు సూచించారు. అయితే ఆలయ అర్చకులు, పురోహితులు, భక్తులు, అధికారులు వీటిని పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం మరోసారి మూలవిరాట్‌కు సంరక్షణ చర్యలు చేపట్టాల్సి వచ్చింది.

ఇవీ చేపట్టాల్సిన జాగ్రత్తలు

స్వామిమూలవిరాట్ సంరక్షణకు పురావస్తు సైన్సు విభాగం పలు సూచనలు చేసింది. స్వామివారి అభిషేకానికి స్వచ్ఛమైన జలాలు వాడాలని సూచించారు. పాలు, పెరుగు, నెయ్యి, నూనెలు, కొబ్బరినీరు, తేనె, అరటిపండ్ల గుజ్జు, పంచదార, గంధం పొడరు, కంకుమ, పండ్లు, పండ్ల రసాలు వినియోగించవద్దని సూచనలు చేశారు. మూలవిరాట్‌ను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన గాలి వీచేలా ఉంచాలని అందుకు ఎగ్జాస్ట్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, జలాలతో అభిషేకించిన తర్వాత మెత్తటి వస్త్రంతో మూలవిరాట్‌ను తుడవాలని, వారానికి ఒకసారి నాన్ అయోనిక్ డిటర్జంట్‌తో శుభ్రపరచాలని, క్యాయర్‌బ్రష్‌లు వినియోగించాలని ఆదేశాలు ఇచ్చారు. నిమ్మ, వెనిగర్ వంటి యాసిడ్ ఉన్న ద్రవాలతో మూలవిరాట్ రంగు మారిపోతుందని పురావస్తుశాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భక్తుల మనోభావాలు....

మూలవిరాట్ సంరక్షణ రెండూ ముఖ్యమే

ద్రాక్షారామ భీమేశ్వరాలయం 892-922 శతాబ్దం మధ్య నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. పురాతన కట్టడంగా కేంద్ర పురావస్తుశాఖ పర్యవేక్షణలో సంరక్షింపబడుతుంది. పురావస్తు సంపదను భావితరాలకు అందించాలనే ధ్యేయంతో పురావస్తుశాఖ కృషి చేస్తోంది. భక్తులు భీమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించి స్వామి కరుణాకటాక్షాలు పొందాలని పరితపిస్తుంటారు. ఈనేపథ్యంలో భక్తులు మనోభావాలు దెబ్బతినకుండా.. మూలవిరాట్ రూపం సంరక్షించేలా పీఠాధిపతులు, దేవదాయశాఖ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరికొద్దిరోజుల్లో స్వామివారి ఆలయం తెరిచి భక్తులకు దర్శనాలు, పూజలకు అవకాశం ఇవ్వనున్నారు. ఈలోగా అందరూ కలిసి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుని ఖచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

గ్రహణం మొర్రి ఉందని

తుప్పల్లో పడేశారు!

ఒంటిమామిడి గ్రామంలో తుప్పల్లో ఆడ శిశువు

గుర్తించి రక్షించిన స్థానికులు



తొండంగి, జూలై 15: గ్రహణం మొర్రితో పుట్టిందనే కారణంతో ఓ పసిపాపను తుప్పల పాల్జేశారు..బంధాన్ని మరిచి కర్కశంగా వ్యవహరించారు. తొండంగి మండలం ఒంటిమామిడిలో ఈ బాధాకరమైన ఘటన జరిగింది. ఆదివారం రాత్రి ఒంటిమామిడి గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపంలో చీరను చుట్టబెట్టి ఆడ బిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు తుప్పల్లో వదిలి వెళ్లారు. సెంటర్‌లో చికెన్ షాపు నిర్వహించుకునే లోవరాజు అనే వ్యక్తి అక్కడ తనకున్న పాక వద్దకు వెళ్లగా తుప్పల్లోంచి పాప ఏడుపు వినబడింది. వెంటనే అక్కడకు వెళ్లి చూడగా గ్రహణం మొర్రితో ఉన్న పండంటి ఆడబిడ్డ కనిపించింది. విషయాన్ని సర్పంచ్ అంగులూరి సుధాకర్‌కు తెలపడంతో వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన పోలీసు, రెవెన్యూ, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు, సర్పంచ్ పర్యవేక్షణలో బిడ్డకు ప్రాథమిక చికిత్స అందించి ఆశ వర్కర్లు అంగన్వాడీల సహాయంతో 108 అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కేవలం రోజుల వయసున్న బిడ్డకు గ్రహణం మొర్రి ఉండడంతో భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు వస్తాయని మూర్ఖంగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. స్థానికంగా ఉన్న వ్యక్తులే ఈ పనికి పాల్పడ్డారా లేదా దూరం నుంచి పాపను తీసుకువచ్చి వదిలివేసారా అనేది తేలాల్సి ఉంది. పాపను వదిలి వెళ్లిన ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో పాటు పందుల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతమని స్థానికులు చెబుతున్నారు. లోవరాజు ఆ సమయానికి వెళ్లకపోతే ప్రమాదం జరిగి ఉండేదని అంటున్నారు. ప్రస్తుతానికి పాప ఆరోగ్యం బాగానే ఉన్నట్లు తెలిసింది. గ్రహణం మొర్రి అనేక ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నా, ప్లాస్టిక్ సర్జరీలు లాంటి అడ్వాన్స్‌డ్ చికిత్సలు ఉన్నా ఇలా తుప్పలు పాలుచేయడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తొండంగి ఎస్ఐ వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.23 కోట్లు

ఆత్రేయపురం, జూలై 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పి.కామేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 33 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.86,25,835, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.37,04,021 మొత్తం రూ.1,23,29,856 ఆదాయం లభించింది. 21 గ్రాముల బంగారం, కిలో వెండి, పలు దేశాల కరెన్సీ లభించినట్లు ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,96,819 లభించింది. లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో నగదు చోరీ

గొల్లప్రోలు రూరల్, జూలై 15: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ నుంచి నగదు చోరీకి గురయింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన ఇంటి అమరావతి తన సోదరి దగ్గర తీసుకున్న డబ్బులను తిరిగి ఇచ్చేందుకుగానూ రూ.70వేలు బ్యాగులో పెట్టుకుని సోమవారం పిఠాపురం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఇదే ఆటోలో చేబ్రోలులో ఇద్దరు మహిళలు ఎక్కారు. పిఠాపురం అని చెప్పిన మహిళలు ఇద్దరు గొల్లప్రోలులో దిగిపోయారు. పిఠాపురంలోని సోదరి ఇంటి వద్దకు వెళ్లి చూసుకునేసరికి బ్యాగులో ఉండాల్సిన రూ.70 వేలు లేకపోగా బ్యాగు కోసి ఉన్నట్లు గుర్తించారు. ఆటోలోకి చేబ్రోలులో ఎక్కిన మహిళలే ఈ చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్ నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జిషీటు ఫైల్ చేయడంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిలు/జామీను విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంబంధిత అధికా రులకు తగిన సిఫార్సులు చేశారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు, జూలై 15: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం వద్ద 60 కిలోలు గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గంజాయి విలువ మార్కెట్‌లో రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి వివరాలను వెల్లడించారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు మండలంలోని ధర్మవరం శివారు తమ్మయ్య చెరువు వద్దషెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.3 లక్షలు విలువ చేసే 60 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సింహాద్రిపురం గ్రామానికి చెందిన కందా సూర్యనారాయణ, ధర్మవరం గ్రామానికి చెందిన ఒనుం ఏసుబాబులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీన పరుచుకుని గంజాయిని సీజ్ చేశారు. ఈ సంఘటనలో సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగిలి మణికంఠ పరారీలో ఉన్నట్లు పెద్దాపురం డీఎస్పీ తెలిపారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చి ధర్మవరం శివారు తమ్మయ్య చెరువు వద్ద ఉన్న షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసి నిందితులు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారని వారిని సీఐ శేఖర్ బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ బృందం ఆదివారం దాడి చేసి అదుపులోకి తీసుకుందన్నారు. చాకచక్యంగా గంజాయి గుట్టును రట్టు చేసిన సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భార్యను హతమార్చిన వ్యక్తికి జీవితఖైదు

కె.గంగవరం, జూలై 15: మద్యం సేవించి భార్యను చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా ఆమెను హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని పామర్రు ఎస్ఐ కె.జానీబాషా చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన గుత్తుల భవానీకి కపిలేశ్వరపురం మండలం నాగులచెరువు గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీనుకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. శ్రీను ఏవిధమైన పని చేయకుండా భార్య చేసిన కూలి డబ్బులపై ఆధారపడుతూ మద్యం సేవించి భవానీని హింసించేవాడు. దీంతో భవాని తండ్రి శేషారావు తన కుమార్తెను ఇంటికి తీసుకువచ్చేశాడు. సుమారు మూడు నెలల తర్వాత తాను మారానని శ్రీను మామగారికి నచ్చచెప్పి, తామరపల్లి గ్రామంలో భార్యతో కలిసి వేరు కాపురం పెట్టాడు. 2021 అక్టోబరు 13న శేషారావు కూలి పనికి వెళ్లి వచ్చి తమ కుమార్తె ఇంటికి తాళం వేసి ఉండటం గమనించాడు. తాళం పగలకొట్టి చూస్తే భవాని రక్తపు మడుగులో చనిపోయి ఉంది. దీనిపై అప్పుడు పామర్రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె.చిరంజీవి కేసు నమోదు చేశారు. శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రాజమహేంద్రవరం కోర్టులో వాదోపవాదనలు అనంతరం నేరం రుజువు అయ్యింది. జడ్జి డి.విజయ్‌గౌతమ్ నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరి మృతి



దుర్గారావు, వెంకటేశ్వరరావు మృతదేహాలు



జక్కం వెంకటేశ్వరరావు



గండి దుర్గారావు

రాజానగరం/దివాన్‌చెరువు, జూలై 15: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జి.యర్రంపాలెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామానికి గండి దుర్గారావు(32), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన జక్కం వెంకటేశ్వరరావు (35) మోటార్‌సైకిల్‌పై దుళ్ల నుంచి పాతతుంగపాడు పయనమయ్యారు. మార్గమధ్యంలో జి.యర్రంపాలెం సమీపానికి వచ్చే సరికి ఎదురుగా టాటాఏస్ వ్యాన్ వీరిని బలంగా ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. స్థానికులు గమనించి వాహనాన్ని ఆపారు. కాగా దుర్గారావు అత్త వారి ఊరు దుళ్లలో ఉంటూ తాపీ పనిచేస్తున్నాడు. తుంగపాడులో అరటి తోట కౌలుకు తీసుకున్నాడు. అరటి గెలలు కోసేందుకు దుళ్ల నుంచి వెంకటేష్‌ను వెంట బెట్టుకుని వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కాగా దుర్గారావుకు ఓ కుమార్తె ఉండగా భార్య ప్రస్తుతం గర్భిణి. వెంకటేష్‌కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే పాతతుంగపాడుకు చెందిన పలువురు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజానగరం ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దుళ్లలో విషాదఛాయలు

కడియం, జూలై 15: తుంగపాడులో జరిగిన ప్రమాదంలో దుళ్ల గ్రామానికి చెందిన జక్కం వెంకటేశ్వరరావు, గండి దుర్గారావు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే వారే. వారి మృతితో ఆ కుటుంబాలు ఆధారాన్ని కోల్పోయాయి. జక్కం వెంకటేశ్వరరావుకు భార్య విజయలక్ష్మి, ఇంటర్ పాసైన కుమార్తె లీలా నాగదివ్య, పదో తరగతి చదువుతున్న శశిధర్ ఉన్నారు. గండి దుర్గారావుకు భార్య నాగలక్ష్మి, ఒకటో తరగతి చదువుతున్న కుమార్తె సంధ్యాదేవి ఉన్నారు. ప్రస్తుతం దుర్గారావు భార్య నాగలక్ష్మి 6 నెలల గర్భిణి.

ఇన్‌స్టాలో పరిచయం

యువకుడితో వెళ్లిపోయిన 17ఏళ్ల అమ్మాయి

20 గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఓ 17ఏళ్ల బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయి రాష్ట్రం దాటేసింది. ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు 20 గంటల్లో ఆచూకీ కనిపెట్టేశారు. సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఓ అపార్టుమెంటులో కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో ఒక కుటుంబం నివసిస్తోంది. పెద్ద కుమార్తె ఇంటర్ వరకూ చదువుకుంది. అయితే ఈ నెల 11న ఉదయం ఇంట్లో వాళ్లు నిద్రలేచే సరికి ఆమె కనిపించలేదు. వాకబు చేసినా ఫలితం లేక అదేరోజు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ బి.వినోద్ తమ సిబ్బందితో రంగంలోకి దిగి గాలింపు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా రైల్వే స్టేషన్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. 11వ తేదీ తెల్లవారుజామున 4 గంటల సమయంలో బాలిక, ఓ యువకుడు రైల్వే స్టేషనుకు వెళ్లి విశాఖ వైపు వెళ్లే గరీబ్‌రథ్ ఎక్కినట్లు గుర్తించారు. సాంకేతిక సహాయంతో అక్కడి నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్ వెళ్లే రైలులో వెళుతున్నట్లు తెలుసుకున్నారు. వెంటనే అక్కడి రైల్వే భద్రతా దళం(ఆర్పీఎఫ్) పోలీసులను, బాలిక బంధువులను అప్రమత్తం చేశారు. 12న మధ్యాహ్నం బాలిక, యువకుడు అక్కడ దిగిన వెంటనే ఆర్పీఎఫ్ పోలీసులు వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడి నుంచి బాలిక తండ్రి, పోలీసు బృందం అహ్మదాబాద్ వెళ్లి వాళ్లిద్దరినీ సోమవారం రాజమహేంద్రవరం తీసుకొచ్చారు. మధ్యప్రదేశ్‌లోని దామో జిల్లా వైశాలి నగర్‌కి చెందిన 19ఏళ్ల యాష్ అగర్వాల్‌తో ఈ బాలికకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడిందని డీఎస్పీ చెప్పారు. బాలికను సురక్షితంగా తల్లిదం డ్రులకు అప్పగించి అగర్వాల్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల విషయంలో పిల్లలను గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ అంబికా ప్రసాద్, టూటౌన్ సీఐ వి.శ్రీనివాస్, ఎస్ఐ బి.వినోద్, హెచ్‌సీ వై.మహేశ్వరరావు, పీసీలు వీరబాబు, కె.ప్రదీప్ కుమార్‌ను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో 'రాత'కు ప్రథమ స్థానం

పోర్టు సిటీ (కాకినాడ), జూలై 15: అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో 'రాత' నాటిక ప్రథమస్థానం కైవసం చేసుకుంది. కళాపరిషత్ 40వ వార్షికోత్సవంలో భాగంగా గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం వివరాలను కళాపరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుతరామారెడ్డి, పంపన దయానందబాబు వెల్లడించారు. వెలగలేరుకు చెందిన థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఈ నాటిక ప్రథమస్థానం సాధించిందన్నారు. పోలుదాసు శ్రీనివాసరావు రచన, దర్శకత్వం వహించారు. ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా స్వప్నం రాల్చిన అమృతం, విముక్తి నాటికలు నిలిచాయి. ఉత్తమ దర్శకుడిగా పోలుదాసు శ్రీనివాసరావు, ఉత్తమ నటిగా జ్యోతిరాణి, ఉత్తమ నటుడుగా జీవీ మనోహర్ బహుమతులు పొందారు. ఉత్తమ సంగీత దర్శకుడిగా నాగరాజు, ఉత్తమ విలక్షణ నటుడిగా వి.నాంచారయ్య బహుమతులు సాధించారని వివరించారు.

54 టెస్టులతో నీటి నాణ్యతను పరిశీలించాలి

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల పరిధిలో ప్రజలకు సరఫరా చేసే మంచినీటికి సంబంధించి వివిధ దశల్లో మొత్తం 54 టెస్టులు చేసి ఆ నీటి పరిస్థితిని నిర్ధారించాలని పబ్లిక్ హెల్త్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ ఎ.సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మునిసిపాలిటీలకు సోమవారం ప్రత్యేక సూచనలు చేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్టు తెలిపారు. తమ సర్కిల్ పరిధిలో రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్లు, 18 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలు ఉన్నాయని, వాటి పరిధిలో రోజూ సుమారు 285 మిలియన్ లీటర్ల శుభ్రపరిచిన తాగునీటిని సరఫరా చేస్తామని, మరో 59 ట్యాంకర్ల ద్వారా 376 ట్రిప్‌లతో అదనంగా 1.8 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామాల నుంచి నగర పంచాయతీలకు మారిన వాటిలో పైపులైన్ల సమస్య ఉందని, మిగతా చోట్ల కూడా పాత పైపులైన్లను తీసేసి కొత్తవి వేయాలని గతంలోనూ సూచించినట్టు చెప్పారు. వర్షాకాలంలో పైపులైన్ల లీకుల వల్ల మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. మంచినీటిని వ్యాధికారక లక్షణాలు, ఇతర లోపాలు నిర్ధారించడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసెడ్యూర్స్ (ఎస్ఓపీ) గైడ్‌లైన్స్‌ను తమ ఈఎన్‌సీ జారీ చేసిందన్నారు. వాటి ప్రకారం ఫిజికల్, కెమికల్, బ్యాక్టరియోలాజికల్, హెవీ మెటీరియల్, పెస్టిసైడ్స్ వంటి ఐదు విభాగాల్లో మొత్తం 54 రకాల పరీక్షలు చేయాలన్నారు. ఫిజికల్ విభాగంలో ప్రతి రోజూ ఆరు రకాల పరీ క్షలు చేయాలన్నారు. భూగర్భజలాలు, బోరు బావులు, చేతిపంపులు, ఇన్‌ఫి ల్ట్రేషన్ బావుల్లో నెలకోసారి ఈ పరీక్షలు చేయాలని సూచించారు. కెమికల్ విభాగంలో 12 రకాల టెస్టులు ఉంటాయని తెలిపారు. బ్యాక్టీరియాకోలి టెస్ట్ వారానికొకసారి చేయాలని చెప్పారు. హెవీమెటీరియల్ విభాగంలో 21 రకాల టెస్టులు చేయవలసి ఉంటుందని తెలిపారు. మూడు నెలలకొకసారి పరీక్షలు నిర్వహించి నిర్ధారించుకోవాలన్నారు. ఇక పెస్టిసైడ్స్ విభాగంలో 14 రకాల టెస్టులు మూడు నెలలకోసారి చేయాలన్నారు. ఆర్గో క్లోరైడ్స్‌కు సంబంధించిన 5 పరీక్షలు ఉంటాయని, వాటిలో మిథైల్ పార్థాన్, మిలాథిన్, క్లోర్పైఫోస్, ఈథిన్, మోనోక్రోటోఫస్ వాటి పరీక్షలను మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని తెలిపారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం

ఇద్దరిపై కేసు నమోదు

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారనే ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై ప్రకాశంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సత్యనారాయణ తెలిపిన, ఎఫ్ఐ ఆర్‌లోని వివరాల ప్రకారం.. పోస్టల్ కాలనీకి చెందిన తురాల శ్రీనివాస్ యాదవ్ కుమార్తె శిరీషా యాదవ్‌కి ఈ ఏడాది మార్చి 20న 77299 48662 నంబరు నుంచి ఒక మేసేజ్ వెళ్లింది. దీనిపై విచారించగా గుత్తుల మురళీ కృష్ణ, కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వైరిచర్ల ఉదయ భాస్కర్ అదే మెసేజ్‌లు పోస్ట్ చేసినట్టు తెలిసింది. బాధితుడు శ్రీనివాస యాదవ్ ఎస్పీకి ఫిర్యాదు చేయగా ప్రాథమిక విచారణ అనంతరం ఆదివారం రాత్రి ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

నిర్వాసితులకు పునరావాస కల్పనకు చర్యలు

పోలవరం ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ

అమలుకు గ్రామాల వారీగా కమిటీలు

రంపచోడవరంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్



కలెక్టర్‌ను ఎత్తుకుని తీసుకువస్తున్న గిరిజనులు

రంపచోడవరం, జూలై 15: 'పోలవరం' నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనంతో కలిసి పోలవరం ప్రాజెక్టు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన పోలవరం ముంపు బాధితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలుకు గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముంపు బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. భూమికి భూమి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేడ్కర్, మమ్మీ, తహశీల్దార్లు చలపతిరావు, సులోచన, డీటీలు కుమారి, కృష్ణశాస్త్రి, ప్రజ్ఞ, చిరంజీవి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అర్జీల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అల్లూరి జిల్లా కొత్త కలెక్టరు దినేష్ కుమార్ అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఏజెన్సీ నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. అర్జీల స్వీకరణ కార్యక్రమానికి కొత్త కలెక్టర్ రావడంతో అర్జీదారులు అధిక సంఖ్యలో తమ సమస్యలను చెప్పుకునేందుకు గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ జాన్‌రాజ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి, డ్వామా పీడీ ఎం.శివయ్య, ఏఎంవో సి.శ్రీహరి, జిల్లా వ్యవసాయాధికారి నందు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, డీడీ షరీఫ్, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, డీఎల్‌పీవో రఘునందన్, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, సర్వే ఇన్‌స్పెక్టర్ కె.దేవేంద్రుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అపూర్వ స్వాగతం

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రంపచోడవరంలో అఖండ స్వాగతం లభించింది. సంప్రదాయ నృత్యాలతో గిరిజనం ప్రేమతో నూతన కలెక్టర్‌కు ఆహ్వానం పలికారు. భుజాలకెత్తుకుని ఆయనను కొద్ది దూరం తీసుకువచ్చారు. గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన ఆయన ఇక్కడి గిరిజనుల మన్ననలు పొందారు. ఇప్పుడు అల్లూరి జిల్లా కలెక్టర్‌గా తమ ప్రాంతానికి రావడంతో రంపచోడవరం ప్రారంభం నుంచి ఆయనను ఊరేగింపుగా గిరిజనులు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ రంపచోడవరం మండలం ఐ.పోలవరంలోని టీటీడీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, గిరిజన సంఘాల నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి, పండా చెల్లన్నదొర, వై.నిరంజనీదేవి పాల్గొన్నారు.

పోశమ్మగండి వద్ద బోట్ల ప్రయాణం నిషేధం

దేవీపట్నం, జూలై15: మండలంలోని పోశమ్మగండి వద్ద వరద ఉధృతిని సోమవారం రంపచోడవరం సీఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోదావరిలో బోట్లపై ప్రయాణం మానుకోవాలని, చేపల వేటకు వెళ్లరాదని పలు సూచనలు చేశారు. గోదావరి పెరుగుతున్న కారణంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

12 అడుగుల కొండ చిలువ హతం



ప్రత్తిపాడు, జూలై 15:మండలంలోని ఒమ్మంగి గ్రామంలో సోమవారం 12 అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన రైతు కొండపల్లి శ్రీనివాస్ పొలంలో కొండ చిలువ కలియ తిరుగుతుండటంతో పొలంలో పని చేస్తున్న వ్యవసాయ కూలీలు గుర్తించి దానిని హతమార్చారు. 12 అడుగుల పొడవు ఉన్న ఈ కొండ చిలువను చూసేందుకు ఆసక్తిగా పొలానికి తరలివచ్చి తిలకించారు.

భీమేశ్వర స్వామికి విశేష పూజలు

సామర్లకోట, జూలై 15: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఆషాడమాసం, సోమవారం కావడంతో పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి విచ్చేసే భక్తులందరూ సామర్లకోట భీమేశ్వరాలయాన్ని సందర్శించడంతో ఆలయం ఆవరణ భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయ కార్యనిర్వహణా ధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు విశేషపూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

● పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు, జూలై 15: విద్యార్థులు, యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి కోరారు. ధర్మవరం జడ్పీ హైస్కూల్లో సోమవారం హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్, స్థానిక ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన విద్యార్థుల సదస్సుకు డీఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్యాభివృద్ధిలో ఉన్నత శిఖరాలు, లక్ష్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలోసర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి డీఎస్పీ లతాకుమారికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తోపాటి ఫణికుమార్, యూటీఎఫ్ నాయకులు దొడ్డిపట్ల రాజబాబు, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు, బాలల చట్టాలపై అవగాహన

కార్పొరేషన్(కాకినాడ), జూలై 15: ఐసీడీఎస్ రమణయ్యపేట సెక్టార్‌లో మిషన్ శక్తి వందరోజుల ప్రోగ్రాంలో భాగంగా సోమవారం సెక్టార్ సూపర్‌వైజర్ కె.అరుణ ఆధ్వర్యంలో మహిళలు, బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్బన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో కేఎస్ అరుణ, అఖిల భారత మహిళా సమాఖ్య కాకినాడ బ్రాంచ్ సెక్రటరీ అడ్వకేట్ పెండెం శ్రీదేవి హాజరై మహిళల చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో దుర్గాంబ, మహిళలు, గర్భిణులు పాల్గొన్నారు.

'విద్యార్థులు చిన్నతనం నుంచి బాధ్యతగా ఉండాలి'

పెద్దాపురం, జూలై 15 : విద్యార్థులు చిన్నతనం నుంచి కర్తవ్యం పట్ల బాధ్యతగా ఉండాలని మేజర్ మహ్మద్ అసీఫ్ అన్నారు. స్థానిక రామా రావుపేటలో ఉన్న శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో విద్యార్థుల కర్తవ్య బాధ్యతల వేడుకల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు బాల్యం నుంచి క్రమశిక్షణతో ఉండాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడు తూ విద్యార్థులు మంచి ధైర్యసాహసాలతో ఉండాలని, భయాన్ని వీడి కర్తవ్యం పట్ల బాధ్యతతో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఆకడమిక్, కల్చరల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

దళిత మహిళ ఇంటిని కూల్చిన అగ్రవర్ణాలపై చర్యలు తీసుకోవాలి

కాకినాడసిటీ, జూలై 15: పెదపూడిలో కాలువగట్టు స్థలంలో నివాసం ఉంటున్న దళిత మహిళ ఇంటిని కూల్చిన అగ్రవర్ణాలపై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గత 40ఏళ్లనుంచి ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న టేకుమూడి రవణమ్మ అనే దళిత మహిళకు తహసీల్దార్ ఇంటి పట్టా మంజూరు చేశారని సోమవారం అధికారులకు వివరించారు. ఇల్లు కూల్చిన అగ్రవర్ణాలపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడి చెంగల్‌రావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాతా సుబ్రహ్మణ్యం, దళిత నాయకులు గుబ్బల ఆదినారాయణ, మోహన అన్నవరం, ఖండవల్లి సుబ్బారావు, కుసునే వెంకటరమణ, రాగుల రాఘవులు, టేకుమూడి త్రిమూర్తులు పాల్గొన్నారు.

జీజీహెచ్ వద్ద అన్నదానం

సర్పవరం జంక్షన్, జూలై 15: కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల రాష్ట్ర జేఏసీ కన్వీనర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు పుట్టినరోజు సందర్భంగా కాకినాడ జీజీహెచ్ వద్ద 500మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సోమవారం పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అన్నదానం కార్యక్రమానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు టీడీపీ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల రాజశేఖర్, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, సీఐఎఫ్ డైరెక్టర్ మూర్తిరాజు పాల్గొన్నారు.

గుణ్ణం చంద్రమౌళిని కలిసిన సూర్యనారాయణరెడ్డి

సామర్లకోట, జూలై 15: అఖిల భారత ష్రింప్ హేచరీస్ అసోసియేషన్ కాకినాడ చాప్టర్ అధ్యక్షుడు సత్తి సూర్యనారాయణరెడ్డి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు చంద్రమౌళికి చాప్టర్ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లాలో ష్రింప్ హేచరీస్ సంస్థలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రభుత్వ సహకారం ఉండేలా అసోసియేషన్‌కు సహకరించాలని సూర్యనారాయణరెడ్డి తదితర అసోసియేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా గుణ్ణం చంద్రమౌళిని కోరారు.

రెండు కార్లు ఢీ: ఇద్దరు వ్యక్తులకు గాయాలు

సామర్లకోట, జూలై 15:. సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో వీకె.రాయపురం గ్రామ శివారున గెయిల్ పైప్‌లైన్ సమీపాన రెండు కార్లు ఎదురెదురుగా అతివేగంగా ఢీకొనడంతో రెండుకార్లకు చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయ పడ్డారు. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాద సమయంలో ఆ రోడ్డు మీదుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. రోడ్డుపై ఉన్న పెద్దగొయ్యిని తప్పించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న కారును అతివేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బాధితులను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆక్వా పరిశ్రమలకు అండగా ఉంటాం

● శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు



యనమలను సత్కరిస్తున్న హేచరీస్ ప్రతినిధులు

తుని రూరల్,జూలై 15: ఆక్వా కల్చర్ పరిశ్రమలకు అండగా ఉంటామని శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. రాష్ట్ర హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును తేటగుంటలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ వ్యాపారులు రాజకీయాలు చేయవద్దని వ్యా పారస్తులకు, పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని ఈ ప్రాంతంలో హేచరీస్, పరిశ్రమల అభివృద్ధి చెంది ఈ ప్రాంత యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యాజమాన్యాలు సహకరించాలని సూచించారు. ఆక్వా రంగానికి భారంగా మారిన కరెంటు చార్జీల సబ్సిడీపై మేనిఫెస్టోలో పెట్టామని వాటి అమలుకు తమవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇశ (ఆల్ ఇండియా ష్రింప్ హేచరీస్ అసోసియేషన్) అధ్యక్షుడు సత్తి సూర్యనారాయణ రెడ్డి(పెదబాబు), రాష్ట్ర కార్యదర్శి యాదాల సతీష్, గౌరవాధ్యక్షుడు మారుతి వెంకటేశ్వరరావుతో పాటుగా హేచరీస్‌కు చెందిన పలువురు యజమానులు ఉన్నారు.

ఉపాధి హామీ అవకతవకలపై అంబుడ్స్‌మెన్ విచారణ

● ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు తొలగింపునకు చర్యలు

జగ్గంపేటరూరల్, జూలై15: మండలంలోని జె.కొత్తూరు గ్రా మంలో ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై ఆంధ్రజ్యోతిలో జూన్ 18న ప్రచురితమైన కథనానికి ఉపాధి హామీ పథకం అం బుడ్స్‌మెన్ ఎం.జ్యోతి స్పందించారు. జె.కొత్తూరు గ్రామ సచివాలయంలో అంబుడ్స్‌మెన్ ఎం.జ్యోతి సోమవారం ఉపాధిహామీ అధికారులు, పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు, గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్స్ మేట్లు, గ్రామస్తుల నుంచి వివరాలు అంబుడ్స్‌మెన్ జ్యోతి అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఈ విచారణలో పనిచేసిన కూలీల మస్తర్లు ఆన్‌లైన్ నుంచి తొలగించినట్లు తేలిందన్నారు. 124 మంది కూలీలు 502 పనిదినాలను ఆన్‌లైన్ నుంచి తొలగించినట్లు వివరించారు. రూ.1.25లక్షలు కూలీలు నష్టపోయినట్లు తెలిపారు. పనిచేసిన వీరందరికీ న్యాయం జరిగేటట్లు చూస్తామన్నారు. వచ్చేవారం పని చేసి న కూలీలకు డిమాండ్ ఇప్పించి ఆన్‌లైన్‌లో మస్తర్లు నమోదు చేసి వారికి డబ్బు లు వచ్చేటట్లు చూస్తామని కూలీలకు హామీ ఇచ్చారు. విధులపట్ల నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ మేట్లను తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏపీవో కృష్ణంరాజు, టీఏ వెంకటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

● జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి
● నియోజకవర్గస్థాయి స్పందనకు 274 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

పెద్దాపురం, జూలై 15 : నిర్ణీత గడువులోగా ప్రజలనుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించడం జరగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.రామ్‌సుందర్ రెడ్డి అన్నారు. స్థానిక రాజుగారి వీధిలో ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆయన ఆర్డీ వో జె.సీతారామారావుతో కలిసి ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలపై సుమారు 274 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత, డీఎల్పీవో బాలామణి, తహశీల్దార్లు ఎస్.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, ఎంపీడీవో మాదిరెడ్డి ఉషారాణి, నియోజకవర్గస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

గండేపల్లి, జూలై15: గ్రామస్థాయిలో ప్రతీ సమస్య పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేసింది. ఈ గ్రీవెన్స్‌లో మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి సమస్యలు స్వీకరించాల్సి ఉంది. ఈ గ్రీవెన్స్‌ను అధికారులు పట్టించుకోకుండా డుమ్మాకొడుతున్నారు. సోమవారం గండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్‌కు అన్నిశాఖల అధికారులు హాజరుకాకపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎంపీడీవో, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, అంగన్‌వాడీ, హౌసింగ్ ఈ ఐదుశాఖలు తప్ప మిగిలిన శాఖల అధికారులు గ్రీవెన్స్‌కు హాజరుకాలేదు.

'భాస్కర్‌కాలనీ సమస్యలు పరిష్కరించాలి'

సామర్లకోట, జూలై 15: సామర్లకోట పట్టణ పరిధిలో 31వ వార్డు భాస్కర్‌నగర్‌లో పలు సమస్యలతో ప్రజలు సతమతమవు తున్నారని మున్సిపల్ అధికారులు సత్వరం స్పందించి చర్యలు తీసుకునేలా ఆదేశించాలని సామర్లకోట జనసేన పార్టీ నాయకులు మడగల శ్యామ్‌కుమార్ తదితరులు సోమవారం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు.

'ప్రజా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి'

పిఠాపురం, జూలై 15: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని పిఠాపురం మునిసిపల్ కమిషనర్ కనకారావు సూచించారు. పురపాలకసంఘ కార్యాలయంలో సోమవారం వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చే వినతుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వీటి విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

ఏలేశ్వరం, జూలై 15: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ డే స్థానిక తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈగ్రీవెన్స్‌కు మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మండలంలోని పారిశుధ్యం, తాగునీటిపై ప్రజా సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు ఇచ్చినట్టు వారు తెలిపారు.

'పాదగయ సెంటర్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి'

పిఠాపురం, జూలై 15: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం వద్ద గల బైపాస్ సెంటర్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉమాకుక్కుటేశ్వర వ్రత పురోహిత సంఘం ఆధ్వర్యంలో అర్చకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. సామర్లకోట, కాకినాడ, కత్తిపూడి వైపు, పిఠాపురం పట్టణంలోకి రాకపోకలు సాగించే 216వ జాతీయరహదారి(పిఠాపురం బైపాస్) జంక్షన్ వద్ద వాహనాల రద్దీ పెరిగిపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సంఘం సభ్యులు తెలిపారు. వాహనాల వేగ నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం, వాహనాలు ఎటువైపు వెళుతున్నాయో తెలియక పలువురు ప్రమాదాలకుగురై గాయాలబారిన పడుతున్నారని చెప్పారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆలయ అర్చకుడు కోట ఫణిశర్మ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. పాదగయ-బైపాస్‌జంక్షన్‌కు సమీపంలోనే రెండు పోలీసుస్టేషన్లు, సర్కి ల్ కార్యాలయం ఉన్నా ప్రమాదాల నివారణకు చర్యలు మాత్రం లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్, పోలీసు ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సం ఘం అధ్యక్షుడు పొక్కులూరి నారాయణ సోమయాజులు కోరారు.

సామాజికాభివృద్ధికి సాహిత్యం దోహదపడుతుంది

● పుస్తకావిష్కరణ సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం



అనితరుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 15: సామాజికాభివృద్ధికి సాహిత్యం దోహదపడుతుందని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం అన్నారు. ప్రముఖ కవి, సాహితీవేత్త ముప్వా శ్రీనివాసరావు రచించిన అనితరుడు పుస్తక పరిచయసభ సోమవారం సాహితీవేత్తల సమక్షంలో జరిగింది. కాకినాడ పీఆర్ కళాశాలలో సహృదయ సాహితీసంస్థ, కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ ఆవంత్స సోమసుందర్ శత జయంతోత్సవ ప్రాంగణంలో పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపాణ్యం మాట్లాడుతూ 366 కవితా విశ్లేషణలతో 1360 పేజీలతో పుస్తకం రావడం అభినందనీయమన్నారు. స్వాతంత్రోద్యమాలతో సాహిత్యంతో ఎంతోకొంత దేశం కోసం పాటుపడ్డారని కొనియాడారు. ఈ సందర్భంగా రచయిత ముప్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ సాహిత్య రంగంలో ఉభయ గోదావరి జిల్లాలకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. తన పుస్తకం విశ్లేషణలో 120 మంది సాహితీవేత్తలు, 30మంది ఆచార్యులు, 60మంది మహిళలతో పాటు మరో 200మంది ఉన్నారన్నారు. సహృదయ సాహితీ సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేదుల శ్రీరామశర్మ(శిరీష) అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ పి సీతారామస్వామి, వీఎస్ఆర్ఎస్ సోమయాజులు, దాట్ల దేవదానంరాజు, కూనపురావు కుమార్, బొల్లోజు బాబా, అద్దేపల్లి ప్రభు, మేకా మన్మధరావు, బీహెచ్‌వీ రమాదేవి మాట్లాడారు. విశిష్ట అతిథులుగా జేఎన్‌టీయూకే డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, పీఆర్ కళాశాల తెలుగు, సంస్కృత శాఖాధిపతి డాక్టర్ వై.బుజ్జి కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. వజ్రాయుధ కవి డాక్టర్ ఆవంత్స సోమసుందర్ చిత్రపటానికి రచయిత ముప్వా శ్రీనివాసరావుతోపాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చీడిగలో సామాజిక భవనం నిర్వహణపై వాగ్వివాదం

● తాళాలు వేసిన ఇరువర్గాలు
● పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం



ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరుగుతున్న దృశ్యం

కాకినాడరూరల్, జూలై 15: రూరల్ మండలం చీడిగలో శెట్టిబలిజ సామాజిక భవనం నిర్వహణపై ఇరు వర్గాలు మధ్య సోమవారం వాగ్వివాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సామాజిక భవనం నిర్మాణాన్ని ప్రారంభించారు. అప్పట్లో ఆనిర్మాణం పూర్తికాకపోవడం అనంతరం విభజిత ఏపీలో 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం అప్పట్లో 2016లో ఒకసారి, 2018లో ఒకసారి మొత్తం సుమారు రూ.45లక్షల నిధులతో సామాజిక భవనం పనులు చేపట్టారు. టీడీపీ హయాంలో మాజీ సర్పంచ్ పితాని అప్పన్న ఒక్కడే నిర్వహణ చేపట్టారని, 2019నుంచి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చే ముందు వరకూ వైసీపీ గ్రామ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి గణేష్ ఒక్కడే నిర్వహణ చేపట్టారని అంతే కాకుండా రూ.40లక్షల నిధులతో గత వైసీపీ ప్రభుత్వంలో సామాజిక భవనంకు ఏమిపనులుచేసారో తెలియడంలేదని ఒక్క వ్యక్తి మాత్రమే సామాజిక భవనం నిర్వహణచేస్తే కుదరదన్నారు. ఈసమస్య పరిష్కారమయ్యేవరకూ గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు గీసాల శ్రీనివాసరావు, నరాల వెంకటేశ్వరరావు, దెయ్యాలశ్రీను, సత్యనారాయణ, నగుబత్తుల రాంబాబు, మహేష్ తదితరులు కలిసి సోమవారం సామాజిక భవనంకు తాళాలు వేశారు. ఇది తెలుసుకున్న మరో టీడీపీ వర్గం తాళం తీయాలని అడగడంతో ఇరు టీడీపీ, జనసేన వర్గాల మధ్య వివాదం జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న ఇంద్రపాలెం పోలీసులు రంగప్రవేశంచేసి ఏవిధమైన గొడవలు జరుగకుండా అక్కడి నుంచి ఇరువర్గాలను పంపించివేయడంతో వివాదం సద్దుమణిగింది. అయితే తాళాలను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి అప్పగిస్తామని వారు తమసమస్యను పరిష్కరిస్తారని ఇరువర్గాల కూటమి నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీనివాస్, వీరబాబు, రమణ, నాగేశ్వరరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో యూత్ స్కిల్స్‌డే

గండేపల్లి, జూలై15: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ ఆవరణలో యూత్ స్కిల్స్‌డే ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. దేశంలోని యువత నైపుణ్యాల అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడం వలన యువత జీవితంలో,సమాజంలో గణనీయమైన మార్పు అభివృద్ధి చోటు చేసుకుంటుందన్నారు. మనదేశం యొక్క విజయం ఎల్లప్పుడు యువత విజయంపై ఆధారపడి ఉంటుందని డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌కుమార్, ప్రొఫెసర్ అక్షయ్, కన్వీనర్ డి.విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ విజయభార్గవి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండేపల్లి, జూలై15: మండలంలో జెడ్.రాగంపేట జాతీయరహదారిపై డివైడర్‌వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతమూరి సూర్యచంద్ర అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకా రం రంపచోడవరం గ్రామానికి చెందిన సూర్యచంద్ర రాజానగరం నుంచి జగ్గంపేట బైక్‌పై వెళుతూ డివైడర్ దాటుతున్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో సూర్యచంద్ర కాలుకి తీవ్రగాయమైంది. హైవే పోలీసు సిబ్బంది క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అధికారులతో మాజీ మంత్రి యనమల సమీక్ష

తునిరూరల్, జూలై 15: నియోజకవర్గంలో గత ప్రభుత్వ పాలకులు పేదలకు ఇళ్లస్థలాల పేరుతో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారంటూ మండల, నియోజకవర్గస్థాయి నాయకులు మాజీ మంత్రి యనమల దృష్టికి తీసుకురావడంతో నియోజకవర్గంలోని తుని, తొండంగి, కోటనందూరు మండలాల తహసీల్దార్‌లు, మున్సిపల్ అధికారులతో మాజీ మంత్రి తేటగుంటలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొనుగోలుచేసిన భూ వివరాలు, వాటి మార్కెట్ విలువ, అమ్మకందారులు, ఖాళీ స్థలాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమగ్రమైన వివరాలు తనకు అందజేయాలని సూచించారు. తుని మున్సిపాల్టీలో పలుఅభివృద్ధి పనులపై అధికారులతో చర్చించిన ఆయన ప్రజాఅవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యంగా గొల్లఅప్పారావు సెంటర్‌లో ఆధునీకరణ పనులు జరిగే క్రమంలో అక్కడ చిన్నాచితక వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. తహసీల్దార్ భరత్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు,ఇంజనీరింగ్ విభాగాధికారులు పాల్గొన్నారు.

మరిడమ్మకు మనసారా మన సారె

పెద్దాపురం, జూలై 15 : పట్టణానికి చెందిన సాయిసేవా గ్రూప్ ఆధ్వర్యంలో మరి డమ్మకు మనసారా మనసారె పేరుతో సోమవారం ఆషాడం సారెను అందచేశారు. స్థానిక శివాలయం గుడి వద్ద ఉన్న సాయిబాబా మందిరం నుంచి పాదయాత్రగా సాయిసేవా గ్రూప్ సభ్యులు తరలివచ్చి మరిడమ్మకు సారెను అందచేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ సాయిసేవా గ్రూప్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో సాయిసేవా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

తాళ్లరేవు, జూలై 15: ఉపాధిహామీ పథకంలో పనిచేసిన కూలీల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయంవద్ద ఉపాధి కూలీలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కార్మికసంఘం నేత టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ కూలిపనిచేసి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కూలీడబ్బులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే కూలీల బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అపర్ణాదేవి ఆలయంలో ఎస్పీ దంపతుల పూజలు



తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో ఎస్పీ దంపతులు

గొల్లప్రోలురూరల్, జూలై 15: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఉన్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సందర్శించారు. సతీసమేతంగా ఆలయంలోని అపర్ణాదేవికి సహస్ర నామ కుంకుమార్చన, నాగేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలకు అభిషేకాలు నిర్వహించారు. ఎస్పీ దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజాది కార్యక్రమాలు అనంతరం వేదాశీర్వచనాలు పలికి శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'ప్రజలకు తాగునీరు అందించడమే లక్ష్యం'

గొల్లప్రోలు, జూలై 15: ప్రజలకు రక్షిత తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం ప్రథమ లక్ష్యమని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీలో నిర్మించిన ఓవర్‌హెడ్ రిజర్వాయర్ నిరుపయోగంగా మారిందని, కుళాయిల ద్వారా తాగునీరు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామన్న కాలనీవాసుల వినతి మేరకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సీఎంవో ద్వారా సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మునిసిపల్ ఆర్జీ నాగనరసింహరావు, పబ్లిక్‌హెల్త్ ఎస్‌ఈ సుధాకర్‌లు పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంకును వినియోగంలోకి తీసుకురావడంతోపాటు పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు నిర్వహించారు. వినియోగంలోకి తీసుకువచ్చిన ఓహెచ్ఎస్ఆర్‌ను మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించి కుళాయిల ద్వారా నీరువిడుదల చేశారు.

'ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి'

శంఖవరం, జూలై 15: శంఖవరంలో స్థానిక మాదిగకాలనీలో ఏపీఎంఆర్‌పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ బోడపాటి చంటిమాదిగ అధ్యక్షత జరిగింది. ఈ సమా వేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపల్లి సత్యనారాయణమాదిగ హాజరయ్యారు. బోడపాటి తాతాజీ, తుని ఇన్‌చార్జ్ పలివెల శివమణి, కాకినాడ రూరల్ ఇన్‌చార్జ్ ఇమ్మానుయేలు, కండపల్లి శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం

● అధికారులకు కమిషనర్ ఆదేశం

కార్పొరేషన్(కాకినాడ), జూలై 15: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజలనుంచి ఫోన్ ద్వారా వచ్చిన వినతులను కమిషనర్ స్వీకరించారు. పారిశుధ్యం, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ఉద్యాన విభాగాలకు సంబంధించి 20మంది సమస్యలను ఫోన్ ద్వారా తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కార్యాలయానికి 16మంది నేరుగా వచ్చి పలు సమస్యలపై వినతులు అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, డీసీపీ హరిదాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, ఈఈ మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకాలు ఉత్తర్వులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 15: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సోమవారం ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. జగన్నాథపురం ఎంఎస్ఎన్ మూర్తి మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తూ మరణించిన సత్యనారాయణ స్థానంలో ఆయన భార్య దుర్గాదేవికి నగరపాలక సంస్థ సాధారణ విభాగంలో పని చేసేలా ఉత్తర్వులు ఇచ్చారు. ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ మృతిచెందిన తాతబ్బాయి స్థానంలో ఆయన సతీమణి సంగంరెడ్డి భవానీని పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

'విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలి'

కలెక్టరేట్(కాకినాడ), జూలై 15: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో కిషోర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు వరహాలు, గంగా సూరిబాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని కోరారు. సీతారామరాజు, అక్షయపాత్ర ఏజెన్సీలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో ఫీజుల నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు.

జియో, ఎయిర్‌టెల్ రీచార్జ్ పెంపునకు నిరసనగా ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), జూలై 15: మొబైల్ నెట్‌వర్క్ వినియోగదారులకు జియో, ఎయిర్‌టెల్ రీచార్జ్ పెంపుదలకు నిరసనగా కాకినాడ కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నేత సత్తిరాజు, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, ట్రేడ్ యూనియన్ నాయకులు చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల అవసరాన్ని అవకాశంగా చేసుకుని జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు రీచార్జ్ భారాలను 12 నుంచి 25శాతం పెంచడం దారుణమన్నారు. కలెక్టరేట్ లో ఆర్డీవో ఇట్ల కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరం నాయకులు మోతా కృష్ణమూర్తి, సీపీఎం నాయకులు నర్ల ఈశ్వరి, రాణి, తలుపులమ్మ, ఏడుకొండలు, వెంకట్రావు, చిరంజీవి పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీ నేత శంకరరావు పేరు మీద
రూ.5 స్టాంప్ విడుదల

కాకినాడ సిటీ, జూలై 15: బడుగు బలహీన వర్గాలకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు చేస్తున్న సేవలను గుర్తించి పోస్టల్ డిపార్ట్‌మెంట్ వారు రూ.5 స్టాంప్‌ను ఆయన పేరు మీద విడుదల చేశామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ తెలిపారు. ఈ మేరకు పోస్టల్ కేంద్ర కార్యాలయం నుంచి విడుదలైన ఈ స్టాంప్ కాపీలను సోమవారం కాకినాడ జీజీహెచ్ సెంటర్‌లోని పూలే విగ్రహం వద్ద బీసీ నాయకులు మీడియాకు చూపారు. శంకరరావు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి పంచారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, బీసీ సంఘాల నాయకులు చొల్లంగి వేణుగోపాల్, నారాయణగౌడ్, రాయల్ శివ, మాజీ కౌన్సిలర్ జోగారాజు, బర్ల శ్రీను, వాసంశెట్టి మాధవ్, విత్తనాల సత్తిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన మేడిశెట్టి

శంఖవరం, జూలై 15: జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పిడుగు హరిప్రసాద్‌ను జనసేనపార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ), జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ కరణం సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపి అన్నవరం సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని అందజేశారు.